## క్లుప్తంగా

### నటరాజు అలంకారంలో నిర్మమహేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పొదిలి రూరల్: పొదిలి శివాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్మమహేశ్వరుడు శుక్రవారం రాత్రి నటరాజు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చంద్ర వాహనంపై పుర వీధుల్లో ఊరేగిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. పెద సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

### ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కామూరి అమూల్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజావేదికలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్ పర్యవేక్షణలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ వెంకటేశ్వర్లు, ఏపీడీ భాస్కర్‌రావు, ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఏపీఓ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పొదిలిలో పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తాం

- కమిషనర్ శ్రీనివాసరావు



ఆలయం వద్ద పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

పొదిలి: పట్టణ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా శ్రీనిర్మమహేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలో భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఆలయ పరిసరాల్లో శివరాత్రి, మరుసటి రోజు రథోత్సవం సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు రానున్న దృష్ట్యా అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కార్మికులు, మేస్త్రీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పట్టణంలో పలు చోట్ల రోడ్లపైకి మురుగు చేరుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

### హైవేలో వేప చెట్లు నరికివేత



వేపచెట్టును మెషీన్‌తో కోసిన దృశ్యం

బేస్తవారిపేట: ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డు వెంట ఉన్న వేప చెట్లను కొందరు వ్యక్తులు పట్టపగలే నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. శుక్రవారం ఉదయం బేస్తవారిపేట మండలంలోని సలకలవీడు బస్టాండ్ సమీపంలో భారీ వేప చెట్లను మెషీన్‌తో ముక్కలుగా చేశారు. ఓ వైపు పర్యావరణాన్ని రక్షించాలంటే మొక్కలు పెంచాలని ఉపన్యాసలిచ్చే రెవెన్యూ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు.. భారీ చెట్లను నరికేస్తున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తరలించేందుకు ముక్కలుగా చేసిన వేప మొద్దులు



బీసీ హాస్టల్లో ఇదీ పరిస్థితి



కంభంలో గృహాల మధ్య పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఇలా..

# ఎక్కడుంది చిత్తశుద్ధి?

- కంభంలో పాఠశాలలు, హాస్టళ్ల వద్ద అధ్వానంగా పారిశుధ్యం
- దుర్వాసన వస్తోందని విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆవేదన
- పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు
- దోమలు దండయాత్ర చేస్తున్నాయని ప్రజల గగ్గోలు
- పంచాయతీ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

కంభం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉండవచ్చని అవగాహన కార్యక్రమాల్లో తరచూ చెప్పే అధికారులు.. కంభంలోని పాఠశాలలు, హాస్టళ్లను చూసినట్టు లేరు! ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల వద్ద పారిశుధ్యం అధ్వానంగా తయారవడంతో విద్యార్థులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు ఆనుకుని ఉన్న డ్రైనేజీల్లో మురుగు నెలల తరబడి పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద కూడా అధికమైంది. ఇప్పటికే ప్రజలు వైరల్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలతోపాటు ఇతర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా వైద్య సిబ్బంది పలురకాల సర్వేలు నిర్వహిస్తున్నారు. విష జ్వరాలు, వ్యాధులు వచ్చిన తర్వాత పరుగులు తీసేకన్నా పారిశుధ్యంపై దృష్టి సారించడం మేలు కదా అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**సమస్యలు ఇక్కడే..**

- కంభం పట్టణంలోని పార్కు వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని ఉన్న కాలువలో మురుగు నిలిచిపోయింది.
- బోర్డు స్కూలుకు ఆనుకొని ఉన్న పంట కాల్వలో మురుగు నిల్వ ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోకి చుట్టు పక్కల నివాసాల వారు పైపులు పెట్టి మురుగు వదిలేస్తుండటంతో పరిసరాలు దారుణంగా ఉన్నాయి.
- బీసీ హాస్టల్‌కు ఆనుకుని మురుగు నిలిచిపోతోంది. ఎస్సీ గరల్స్ హాస్టల్స్ సమీపంలో మురుగు నిల్వ ఉండటంతో పాటు పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇంకా పలు ప్రభుత్వ పాఠశాలలకు వద్ద మురుగు నిల్వ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు.
- పట్టణంలో గృహాల మధ్యలో నుంచి వెళ్తున్న ఇరిగేషన్ కాలువల్లో మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. దోమల బెడద పెరిగిపోతుందని ఇరిగేషన్ కాలువ వెంట నివాసం ఉంటున్నవారు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పార్కువీధిలోని ప్రాథమిక పాఠశాల వద్ద నిలిచిన మురుగు



బోర్డు స్కూల్‌కు ఆనుకొని పంట కాల్వలో పేరుకుపోయిన మురుగు

## వైఎస్సార్ సీపీ నేతలకు అభినందనలు



బేస్తవారిపేట : ఎంపీపీ ఓసూరారెడ్డిని అభినందిస్తున్న నాయకులు



పొదిలిలో శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు

బేస్తవారిపేట/కొమరోలు/పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీలుగా నియమితులైన బేస్తవారిపేట ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సానికొమ్ము పిచ్చిరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి, అలాగే పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడును ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు అభినందించారు. వీరిని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సంర్భంగా పార్టీ పదవులు పొందిన వారు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేస్తామని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని పేర్కొన్నారు.



సారె వెంకట నాయుడు

## అమ్మ భాషను కాపాడుకుందాం



పార్వతీపురం హైస్కూల్లో కవులు, రచయితల చిత్ర పటాల ప్రదర్శన

పొదిలి: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మండలంలోని పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగుభాషాభివృద్ధికి కృషి చేసిన కవులు, రచయితలు, కళాకారుల చిత్రాలను ప్రదర్శించి విద్యార్థులకు వారి గురించి వివరించారు. అమ్మ భాష తెలుగును కంటికి రెప్పలా కాపాడుకుందామని, భాషాభివృద్ధికి సాహితీవేత్తలు, ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రధానోపాధ్యాయుడు వెన్నెల మల్లికార్జునరావు పేర్కొన్నారు. విద్యార్థులకు పద్యాల కంఠస్థ పోటీలు, తెలుగు భాష ప్రాధాన్యతపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు సుభాషిణి, సునీత, ఆదిలక్ష్మి, వరలక్ష్మమ్మ, సుజాత, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

**మాతృభాషతోనే వ్యక్తిత్వ వికాసం**

మార్కాపురం: మాతృభాషను ఎవరూ మర్చిపోకూడదని, విద్యార్థుల్లో వ్యక్తిత్వ, మానసిక వికాసానికి భాష దోహదపడుతుందని మార్కాపురం జడ్పీ బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధారణ శక్తిని పెంపొందించే ప్రక్రియలు తెలుగు భాషలో ఉన్నాయని, అందులో అవధానం అతిముఖ్యమైన ప్రక్రియ అని ఈ ఘనత తెలుగు భాషకే దక్కుతుందన్నారు. జీవన విధానం, శతకాలు, కవితలు, సాహిత్యం తదితర అంశాలన్నీ తెలుగు భాషలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఓవీ వీరారెడ్డి, ఉమాదేవి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సమీవుల్లా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన ఉపాధ్యాయులు

## టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్

బేస్తవారిపేట: సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక యశ్వంత్ జూనియర్ కళాశాలలో నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఈశ్వరమ్మ, కళాశాల కరస్పాండెంట్ బి.వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.యోగానందరెడ్డి, అధ్యాపకులు, వార్డెన్లు పాల్గొన్నారు.



బేస్తవారిపేటలో మాట్లాడుతున్న లక్ష్మానాయక్

**ఆందోళన వీడి పరీక్షలు రాయండి**

మార్కాపురం టౌన్: పదో తరగతి విద్యార్థులు ఆందోళన వీడి పరీక్షలకు సిద్ధం కావాలని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ సూచించారు. మార్కాపురం పరిధిలోని వివిధ హస్టళ్లలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ప్రేరణ సదస్సులు నిర్వహించారు. టెన్త్ విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చదువుకోవాలని సూచించారు. సబ్జెక్టు నిపుణులైన ప్రదీప్ కుమార్, సజీవరాజు, వై.సైమన్, గౌతమ్‌బాబు, వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కేవీ విశ్వేశ్వరరావు తదితరులు సలహాలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో వివిధ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఎంవీ దేవసేనకుమార్, వై.రామయ్య, శ్రీరాములు, ధారా శ్రీను, జి.వెంకటేశ్వరరెడ్డి, డి.లక్ష్మీనాయక్, డి.నాగలక్ష్మి, యాసిన్‌బేగం, మహాలక్ష్మి తదితరులు సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేశారు.



ప్రేరణ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

### దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



నీటి తొట్లను పరిశీలిస్తున్న యూనిట్ సిబ్బంది

తర్లుపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మార్కాపురం సబ్ యూనిట్ ఆఫీసరు ఆర్.నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తర్లుపాడులోని బీసీ కాలనీలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించారు. ఇళ్ల ముందు చెత్తా చెదారాన్ని తొలగించుకోవాలని, తొట్లలో, డ్రమ్ముల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని, రాత్రిపూట దోమతెరలు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది తులసీప్రసాద్, నాగేశ్వరమ్మ, రాధాదేవి పాల్గొన్నారు.

### ఏప్రిల్ 20న మోడల్ స్కూల్లో ప్రవేశపరీక్ష

మార్కాపురం టౌన్: ఏపీ మోడల్ స్కూల్లో ప్రవేశానికి ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మండలంలోని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నామని ప్రవేశపరీక్ష 5వ తరగతి స్థాయిలో ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 31లోగా గేట్‌వే ద్వారా పరీక్ష రుసుం 150 రూపాయలు చెల్లించాలని స్పష్టం చేశారు. వివరాలకు www.apms.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## వెలిగొండ నిర్వాసితులకు కూటమి తీరని అన్యాయం



మాట్లాడుతున్న సోమయ్య

- ఇరిగేషన్ మంత్రి నిమ్మల ప్రకటన కుట్రపూరితం
- రూ.1203 కోట్ల ఖర్చును రూ.880 కోట్లకు కుదించడమేంటి?
- విలేకరుల సమావేశంలో సీపీఎం నేతల ధ్వజం

మార్కాపురం: రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టుపై చేసిన ప్రకటన చూస్తే ముంపు గ్రామాల నిర్వాసితులకు అన్యాయం చేసేలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దగ్గుబాటి సోమయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కారాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20న రాష్ట్ర సచివాయలంలో ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు నిర్వాసితుల ఆర్ఆర్ ప్యాకెజీ కోసం రూ.880 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని చెప్పారని, దీని ప్రకారం ముంపు గ్రామాల్లోని కుటుంబాల సంఖ్యను భారీగా తగ్గించి చేతులు దులుపుకునేలా ఉందన్నారు. ఈ ఏడాది జనవరిలో కలెక్టర్, ఆర్అండ్ఆర్ కమిషనర్లు ప్రభుత్వానికి పంపించిన నివేదికలో 7,555 మంది నిర్వాసిత కుటుంబాల వారు ఉన్నారని, వారికి 12 లక్షల రూపాయల చొప్పున ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపునకు, పునరావాస కాలనీలో సౌకర్యాల కోసం మొత్తం రూ.1203 కోట్ల రూపాయలు అవసరమవుతుందని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. మంత్రి మాత్రం కేవలం రూ.880 కోట్ల ఖర్చవుతుందని చెబుతున్నారంటే నిర్వాసితుల సంఖ్యను భారీగా తగ్గించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్న అనుమానం వస్తోందన్నారు. 11 గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలకు ఒకే పర్యాయం నష్టపరిహారం చెల్లించేలా ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాబోయే వరద సీజన్ నాటికి ముంపు గ్రామాల్లో నివాసం ఉంటున్న 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ కటాఫ్ డేట్ పెంచి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించినప్పుడు మాత్రమే న్యాయం జరుగుతుందని, ప్రాజెక్టుపై ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణకార్యదర్శి డీకేఎం రఫీ, రూబెన్, నన్నేసా, సురేష్‌కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

మార్కాపురం టౌన్: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏపీ ఎన్‌జీసీ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. పాఠశాలలో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని సూచించారు.

హెచ్‌ఎం చంద్రశేకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఎం.సజీవరాజు, ఎంఈఓలు రాందాస్‌నాయక్, శర్వాణి, రవిశేఖర్ రెడ్డి, ప్రదీప్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, ఎలిజబెత్‌రాణి, వెంకటేశ్వర్లు, అల్లూరయ్య, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న స్రవంతి తదితరులు

### జూనియర్ కళాశాల పీడీకి సన్మానం




మాట్లాడుతున్న ఆర్ఐఓ సైమన్ విక్టర్

కంభం: ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి, విద్యార్థుల శ్రేయస్సుకు ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు ఎంవీ మురళీ కృష్ణ చేసిన కృషి నిరుపమానమని ఇంటర్మీడియెట్ విద్యా మండలి ఆర్ఐఓ సైమన్ విక్టర్ పేర్కొన్నారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్‌గా పనిచేస్తూ ఈ నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం ఎంతో తపనపడేవారని, తోటి ఉపాధ్యాయులకు మురళీ కృష్ణ ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ బెల్లంకొండ నాయుడు, ఎంఈఓలు మాల్యాద్రి, శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.